జితేందర్‌సాయి (ఫైల్)

పామర్తి శశాంక్ (ఫైల్)

ప్రాణాలు తీసిన ఆట సరదా

సీతారామ కాల్వలో పడి ఇద్దరు చిన్నారుల మృతి

సత్తుపల్లిటౌన్, సెప్టెంబర్ 16: నీళ్లలో ఆట సరదా ఇద్దరు చిన్నారులను బలి తీసుకున్నది. ఈ ఘటన సోమవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామంలో చోటుచేసుకుంది. సోమవారం సెలవు దినం కావడంతో బుగ్గపాడు గ్రామానికి చెందిన మడుపల్లి జితేందర్‌సాయి (9), పామర్తి శశాంక్ (9) మరో మిత్రుడు చరణ్‌తో కలిసి మధ్యాహ్నం భోజనం తర్వాత ఆడుకునేందుకు గ్రామ సమీపంలోని సీతారామ ప్రాజెక్టు కాల్వ వద్దకు వెళ్లారు. ఆడుకునేందుకు శశాంక్, జితేందర్‌సాయి నీటిలోకి దిగగా.. ఒడ్డునే ఉన్న చరణ్ వారిద్దరినీ వారించాడు. కాల్వలో నిలిచిన నీటిలోకి ప్రమాదవశాత్తు జారి ఇద్దరూ పడిపోయారు. మిత్రులు ఎంతకూ కనిపించకపోవడంతో ఆందోళన చెందిన చరణ్ పరిగెత్తుకుంటూ వెళ్లి కుటుంబ సభ్యులకు చెప్పాడు. దీంతో జితేందర్‌సాయి తండ్రి శ్రీను, మరికొందరు గ్రామస్థులతో కలిసి కాల్వకు వద్దకు వెళ్లి చూడగా.. ఇద్దరు చిన్నారులు నీటిపై తేలియాడుతూ కనిపించారు. వారిని బయటకు తీసి ప్రైవేటు వాహనంలో సత్తుపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. ఈ మేరకు సత్తుపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అధికారులు, కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యంతోనే సీతారామ ప్రాజెక్టు కాల్వ నీటిలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందారని, దీనికి కాంట్రాక్టు సంస్థ ప్రసాద్ కో కంపెనీ బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు కంపెనీ కార్యాలయం ఎదుట సోమవారం రాత్రి ఆందోళన చేపట్టారు. తక్షణమే కంపెనీ యాజమాన్యం స్పందించి మృతిచెందిన చిన్నారుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సీఎం పదవి నుంచి దించేదాకా వదలను

- ప్రజలపక్షాన మాట్లాడితే చంపుతవా?
- ఈటల వద్ద 25 కోట్లు తీసుకున్నవ్ : కౌశిక్‌రెడ్డి
- రేవంత్‌ది అరాచక పాలన: కేపీ వివేకానంద

తెలంగాణ భవన్‌లో సోమవారం మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి తదితరులు

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : ప్రజల పక్షాన మాట్లాడుతున్నందుకు, హామీల అమలుపై నిలదీస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డి తనను చంపాలని ప్రయత్నిస్తున్నాడని, అందుకే తన ఇంటిపై దాడి చేశారని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. రేవంత్‌రెడ్డిని పీసీసీ అధ్యక్షుడిగా తానే చేశానని, ఇప్పుడు రేవంత్ సీఎం పదవి నుంచి దిగిపోయేదాకా నిద్రపోను అని, కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యేదాకా విశ్రమించకుండా పనిచేస్తానని ప్రకటించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా రేవంత్‌రెడ్డి గుండెల్లో నిద్రపోతానని తెలిపారు. తనకు ఏదైనా జరిగితే రేవంత్‌రెడ్డే బాధ్యుడని, తనను చంపేందుకు యత్నించిన రేవంత్‌రెడ్డిపై సెక్షన్ 307 కింద కేసు నమోదు చేయాలని డీజీపీ, సీపీని డిమాండ్ చేశారు. లేకుంటే గవర్నర్‌ను కలుస్తామని చెప్పారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తన ఇంటిపై దాడికి వెళ్లింది తమవాళ్లేనని సీఎం ఒప్పుకొన్నారని, స్వయంగా ఎమ్మెల్యే ఇంటిపై దాడికి పంపించానని చెప్పడం సిగ్గుచేటని మండిపడ్డారు. తనను ఎందుకు హత్య చేయాలని అనుకుంటున్నారో సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు. సమస్యలపై, కాంగ్రెస్ హామీలపై నిలదీస్తున్నందుకు తనను హత్య చేయాలనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపైకి తమ వాళ్లే వెళ్లారని సీఎం చెప్పినా డీజీపీ, హోం సెక్రటరీ ఎందుకు స్పందించడంలేదని నిలదీశారు. ఎమ్మెల్యే ఇంటిపై దాడి జరిగితే సైబరాబాద్ సీపీ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. నెక్నాంపూర్ వాసవి ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలోని వేసెల్లా విల్లాస్ శివానందరెడ్డి అనే బిల్డర్‌ను బెదిరించి రేవంత్ రెడ్డి తన సోదరుడు తిరుపతిరెడ్డికి ఫ్లాట్ ఇప్పించాడని, ప్రజల నుంచి ఒత్తిడి రావడంతో ఇల్లు కూలగొడతానని తన సోదరుడికి చెప్పి నోటీసులతో సరిపెట్టారని గుర్తుచేశారు. హుజూరాబాద్ ఉప ఎన్నికలో రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఈటల రాజేందర్ దగ్గర రూ.25 కోట్లు తీసుకొని ఈటెల గెలుపు కోసం సహకరించారని, అందుకే తాను కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరానని తెలిపారు.

హైకోర్టు తీర్పుతో కాంగ్రెస్‌లో ప్రకంపనలు : కేపీ వివేకానంద

ఫిరాయింపులపై హైకోర్టు తీర్పు తర్వాత కాంగ్రెస్‌లో ప్రకంపనలు మొదలయ్యాయని ఎమ్మెల్యే కేపీ వివేకానంద దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి సంకుచిత మనస్తత్వంతో మాట్లాడి తన దీనస్థితిని బయటపెట్టుకున్నారని విమర్శించారు. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలు అభద్రతాభావంలో ఉన్నారని చెప్పారు. పది మంది ఎమ్మెల్యేలపై చర్యల కోసం స్పీకర్‌ను కోరితే తమకు సమాధానం చెప్పలేక కౌశిక్‌రెడ్డి ఇంటిపైకి అరికెపూడి గాంధీని ఉసిగొల్పారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఆటవిక, అరాచక పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు.

దిగజారుడు మాటలు బంద్‌చెయ్ : సంజయ్

రేవంత్‌రెడ్డి దిగజారుడు మాటలను బంద్ చేయాలని, ఆయన పొద్దునోమాట, రాత్రో మాట మాట్లాడుతున్నాని ఎమ్మెల్యే డాక్టర్ కే సంజయ్ కుమార్ మండిపడ్డారు. ఢిల్లీలో గాంధీ బీఆర్ఎస్ అని చెప్పి, హైదరాబాద్ రాగానే కాంగ్రెస్ ఎమ్మెల్యే అంటున్నారన్నారు. రాజకీయమంటే తిట్టాలి, కొట్టాలి అనే విధంగా తయారైందని, ఎందుకు రాజకీయాల్లోకి వచ్చామా అని రోజూ బాధపడుతున్నామని చెప్పారు. రేవంత్‌రెడ్డి ఎప్పటికీ కేసీఆర్ అంత గొప్పోడు కాలేడని చెప్పారు. ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఎటు కాకుండా పోయారన్నారు.దానం నాగేందర్, అరికెపూడి గాంధీ తమ ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్‌చేశారు. బీఆర్ఎస్ కారు గుర్తుపై గెలిచిన దానం నాగేందర్, అరికెపూడి గాంధీ బీఆర్ఎస్‌పైనే విమర్శలు చేయడం విడ్డూరంగా ఉన్నదని మండిపడ్డారు.

ముఖ్యమంత్రి గారూ.. రుణమాఫీ ఎప్పుడు?

- తీవ్ర నిరాశలో రుణమాఫీకాని రైతులు
- కొందరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు
- షరతులు లేకుండా తక్షణమే మాఫీ చేయండి
- సీఎంకు రైతుల లేఖ.. సోషల్ మీడియాలో వైరల్

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో రుణమాఫీకాని రైతులంతా తీవ్ర నిరాశలో ఉన్నారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అర్హులందరికీ రూ.2 లక్షల రుణ మాఫీ చేయాలని.. రుణమాఫీకాని రైతుల సంఘం సోమవారం సీఎంకు లేఖ రాసింది. ప్రతి కుటుంబానికి 2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి మాఫీ కాకపోవడం వల్లనే తాము లేఖ రాస్తున్నట్టు రైతులు పేర్కొన్నారు. రుణమాఫీ అవుతుందో లేదోనని ఆందోళనతో కొందరు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని లేఖలో పేర్కొన్నారు. రెండు లక్షల కన్నా అధికంగా ఉన్న రుణాన్ని చెల్లిస్తేనే రుణమాఫీ అన్న నిబంధనతో రైతులు దిక్కుతోచనిస్థితిలో ఉన్నారని, తక్షణమే ఆ నిబంధనలు ఎత్తివేయాలని కోరారు. ప్రతి కుటుంబంలో కనీసం ఒకరికైనా రెండు లక్షల వరకు రుణమాఫీ షరతులు లేకుండా చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించారు.

లేఖ సారాంశం..

'గౌరవ నీయులైన తెలంగాణ ముఖ్యమంత్రి గారికి..

అయ్యా..

మేమంతా రాష్ట్రంలో రుణమాఫీ కాని రైతులం. మాకు వివిధ బ్యాంకు ఖాతాలో రెండు లక్షలకు పైగా వ్యవసాయ రుణాలు కలవు. ప్రభుత్వం ప్రతి కుటుంబానికి 2 లక్షల రుణ మాఫీ చేస్తానని ఇప్పటివరకు రెండు లక్షలలోపు రైతులకే మాఫీ చేసింది. రుణమాఫీ ఎందుకు కాలేదో తెలియక వ్యవసాయశాఖ, బ్యాంకు అధికారుల చుట్టూ రైతులు తిరుగుతున్నారు. కొంత మంది తీవ్ర నిరాశతో ఆత్మహత్యలు చేసుకున్నారు. ఒకొక్కరి కుటుంబంలో నాలుగైదు లక్షల కుపైగా ఉన్నందున పైన ఉన్న డబ్బులు కడితేనే మాఫీ అవుతుందని చెప్పేసరికి దిక్కుతోచనిస్థితిలో రైతులు ఉన్నారు. ప్రతి కుటుంబంలో కనీసం ఒకరికైనా రెండు లక్షల వరకు రుణ మాఫీ షరతులు లేకుండా చేయాలని మీకు విన్నవించుకుంటున్నాం. మాయందు దయతలచి మాకు న్యాయం చేయాలని కోరుతున్నాం.' అని రెండు లక్షల పైనా అప్పు ఉండి రుణమాఫీ కానీ బాధిత రైతులు పేర్కొన్నారు.ఈ లేఖ ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

కాలగర్భంలోకి అప్పర్ ప్రైమరీ స్కూళ్లు!

- ప్రాథమిక బడుల్లో విలీనానికి సర్కారు యోచన
- రద్దయ్యే ప్రమాదంలో 3,144 స్కూళ్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): అప్పర్ ప్రైమరీ స్కూళ్లు.. వీటినే ప్రాథమికోన్నత బడులంటారు. 1 -7 తరగతుల వరకు ఉండే ఈ బడులు ఇక కాలగర్భంలో కలవనున్నాయి. వీటిని రద్దుచేసి, ప్రాథమిక బడుల్లో విలీనంచేసే అంశాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పరిశీలిస్తుంది. ఇదే జరిగితే రాష్ట్రంలోని 3,144స్కూళ్లు కనుమరుగు కానున్నాయి. ఇటీవలి నిర్వహించిన విద్యాసంస్కరణల క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో ప్రాథమికోన్నత బడులపై చర్చ జరిగింది. విలీన అంశంపై అధ్యయనం చేసి నివేదికను అందించాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను ఆదేశించింది. నివేదిక అనంతరం ప్రాథమికోన్నత బడుల విలీనం లాంఛనమేకానుంది.

తగ్గుతున్న ఎన్‌రోల్‌మెంట్

సర్కారు బడుల్లో కొంత కాలంగా ఎన్‌రోల్‌మెంట్ తగ్గుతున్నది. గతంలో 23 లక్షలుండగా, ఈ ఏడాదికి ఎన్‌రోల్‌మెంట్ 20- 18లక్షలకు తగ్గింది. 65.47శాతం సర్కారు బడులుంటే.. ఎన్‌రోల్‌మెంట్ 34.23శాతం మాత్రమే. ప్రాథమికోన్నత బడుల విషయానికి వస్తే 3,144 స్కూళ్లల్లో 15,491 మంది విద్యార్థులున్నారు. వీటిల్లో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని పరిశీలిస్తే 1: 14గా ఉంది. అంటే విద్యార్థులు తక్కువ ఉండగా, టీచర్ల సంఖ్య అధికంగా ఉంది. ఎన్‌రోల్‌మెంట్ ఏటా తగ్గుతుండటంతో కొంతకాలంగా బడుల రేషనలైజేషన్‌ను అమలుచేస్తున్నారు. ఇటీవలీ టీచర్ల బదిలీల్లోనూ అంతర్గతంగా బడుల రేషనలైజేషన్‌ను అమలుచేశారు. దీనికి కొనసాగింపుగా ప్రాథమికోన్నత బడులను ప్రాథమిక బడుల్లో విలీనంచేసేందుకు రంగం సిద్ధంచేస్తుంది. 1,864 జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లుండగా.. ఇందులో పనిచేస్తున్న 1,617 మంది టీచర్లను ఇతర స్కూళ్లకు బదిలీచేయనుంది. దీంతో జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లు మూతపడ్డట్టే.

రాష్ట్రంలో ప్రాథమికోన్నత బడులు.. వాటిల్లోని విద్యార్థులు

విద్యార్థుల సంఖ్య	బడులు	టీచర్లు
0	36	73
1- 10	00	00
11-20	03	02
21-30	01	04
31-40	05	18
41-50	07	22
50 మంది	10	36



స్పీకర్, కాలె యాదయ్య మధ్య కోల్డ్‌వార్!

వికారాబాద్ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్యపోరు

వికారాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): స్పీకర్ ప్రసాద్‌కుమార్-చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మధ్య కోల్డ్‌వార్ మొదలైంది. స్పీకర్‌కు తెలియకుండా యాదయ్య వికారాబాద్ నియోజకవర్గంలో రాజకీయం చేయడం అంతర్గత కుమ్ములాటకు దారి తీసింది. స్పీకర్ షిర్డీ వెళ్లిన సమయంలో వికారాబాద్ సెగ్మెంట్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులను యాదయ్య సీఎం వద్దకు తీసుకెళ్లడంపై ప్రసాద్‌కుమార్ గుర్రుగా ఉన్నట్టు సమాచారం. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యను నియోజకవర్గమంతటా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వ్యతిరేకించడం, దాడులకు తెగబడుతుండటంతో ఆయన చేవెళ్ల కంటే వికారాబాద్ సెగ్మెంట్‌కే అధికంగా ప్రాధాన్యమిస్తున్నట్టు సమాచారం. ఆ విధంగా వికారాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను రెండుమార్లు యాదయ్య సీఎం వద్దకు నడిపించినట్టు తెలిసింది. తాము కేవలం అభివృద్ధి పనుల కోసమే సీఎంను కలిసినట్టు యాదయ్య చెప్తున్నప్పటికీ ఆయన తన సొంత నియోజకవర్గం నేతలను కాకుండా స్పీకర్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు చెందిన నాయకులకు సన్నిహితంగా కావడంపైనే రచ్చ మొదలైంది. తన నియోజకవర్గంలో కాలె యాదయ్య చేస్తున్న రాజకీయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ త్వరలోనే తీసుకెళ్తారని పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

నాగర్‌కర్నూల్ జిల్లాలో మునిగిన వట్టెం పంపుహౌస్ నుంచి నీటి తోడివేతను పరిశీలిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ నాగం జనార్దన్‌రెడ్డి

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే 'వట్టెం' మునక

మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే వట్టెం పంప్‌హౌజ్ నీట మునిగిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత డాక్టర్ నాగం జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర సమీపంలో నీట మునిగిన వట్టెం(వెంకటాద్రి)రిజర్వాయర్ పంప్‌హౌజ్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా టన్నెల్‌లోకి వెళ్లి పంప్‌హౌజ్‌లో నీట మునిగిన మోటర్లను, అక్కడ జరుగుతున్న పనితీరును పరిశీలించారు. ఈఈ పార్థసారథితో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పంప్‌హౌజ్ మునకకు వందశాతం ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. నీళ్లతో పంప్‌హౌజ్ మునుగుతుందని ప్రజలు తెలిపినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ధ్వజమెత్తారు. అసలు అధికారులకు బుద్ధి ఉందా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల నిర్వహణలో బాధ్యతారాహిత్యానికి కారణమైన ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీలైనంత త్వరగా టన్నెల్‌లోని నీటిని తోడి బురదలో కూరుకుపోయిన మోటర్లను వెలికి తీయాలని సూచించారు. లేకుంటే రూ.2,600 కోట్ల విలువైన మోటర్లకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ ప్రాజెక్టును గత కేసీఆర్ ప్రభుత్వం దాదాపుగా పూర్తిచేసిందని, దీన్ని ప్రారంభిస్తే తమకు పేరు రాదనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో అత్యంత నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టు ఏదైనా ఉందంటే.. అది పాలమూరు ఎత్తిపోతల పథకమే అని పేర్కొన్నారు. పాలమూరు బిడ్డను అని చెప్పుకొనే సీఎం రేవంత్ రెడ్డి దాదాపు పూర్తయిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను బయటపెట్టాలన్నారు. రూ.2లక్షల రుణమాఫీ వంద శాతం చేయాలని డిమాండ్ చేశారు.

నీళ్లు విడుదల చేయాలని రైతుల ఆందోళన

పంటలు ఎండుతున్నాయని సర్కారుపై ఆగ్రహం

తిప్పర్తి, సెప్టెంబర్16: నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలానికి సాగునీరు అందించే డీ-40 కాల్వకు నీటిని విడుదల చేయాలని పలు గ్రామాల రైతులు సోమవారం కాల్వ వద్ద నిరసన తెలిపారు. రైతులు మాట్లాడుతూ.. నిరుడు సాగర్ ప్రాజెక్టులో నీళ్లు లేవని కాల్వకు నీటి విడుదల చేయలేదని, ప్రస్తుతం నాగార్జునసాగర్ పూర్తిస్థాయిలో నిండినప్పటికీ కాల్వకు నీరు విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. డీ-40 కాల్వ ద్వారా తిప్పర్తి, పజ్జూరు, ఎర్రగడ్డలగూడెం, వెంకటాద్రిపాలెం, ఇండ్లూరు, సర్వారంతోపాటు మాడ్గులపల్లి, వేములపల్లి మండలాల్లోని పలు గ్రామాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. వానకాలం సీజన్ ముగిసే దశకు వచ్చినా నేటికీ కాల్వకు నీరు విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని వాపోతున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించి వెంటనే నీటిని విడుదల చేయించాలని డిమాండ్ చేశారు.

ప్రాజెక్టుల స్వాధీనానికే కేంద్రం మొగ్గు

మొదటిపేజీ తరువాయి...

తెలపాలని సుప్రీంకోర్టు ఆదేశించడంతో కేంద్ర జల్‌శక్తి శాఖ తాజాగా అఫిడవిట్‌ను దాఖలు చేసింది. ప్రాజెక్టుల స్వాధీనానికి, నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని, అందుకు సంబంధించి గెజిట్‌ను కూడా జారీ చేశామని, అయితే ఇరు రాష్ట్రాలు సీడ్‌మనీని చెల్లించాల్సి ఉన్నదని కోర్టుకు నివేదించింది.

సాగర్‌ను గాలికొదిలేసిన రేవత్ సర్కారు

నాగార్జునసాగర్ డ్యామ్‌ను తెలంగాణ ఆధీనంలోకి తీసుకువచ్చే అంశాన్ని రేవంత్‌రెడ్డి సర్కారు పూర్తిగా గాలికి వదిలేసినట్టు స్పష్టమవుతున్నది. ఆ డ్యామ్ 10 నెలల నుంచి సీఆర్‌పీఎఫ్ బలగాల ఆధీనంలోనే ఉంది. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించకపోవడమే ఇందుకు నిదర్శనం. అసెంబ్లీ ఎన్నికలకు ముందు నిరుడు నవంబర్ 29న అర్ధరాత్రి వేళ ఏపీ సర్కారు అప్రజాస్వామికంగా సాయుధబలగాలతో సాగర్ డ్యామ్‌పైకి తరలివచ్చి సీసీ కెమెరాలు ధ్వంసం చేసి కుడికాలువ హెడ్ రెగ్యులేటరీని,13వ నంబర్ వరకు ఉన్న గేట్లను ఆక్రమించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కారు ఈ ఘటనపై కొన్ని రోజులు హడావుడి చేసింది. సాగర్ డ్యామ్‌ను ఎట్టిపరిస్థితుల్లో బోర్డుకు అప్పగించబోమని, తిరిగి తెలంగాణ ఆధీనంలోకి తీసుకొస్తామని ప్రగల్భాలు పలికింది. ఆ తర్వాత అందుకు విరుద్ధంగా డ్యామ్‌తోపాటు పలు అవుట్‌లెట్లను అప్పగిస్తామని జనవరి 17న కేంద్ర జల్‌శక్తి శాఖ, ఫిబ్రవరి 1న కేఆర్‌ఎంబీ నిర్వహించిన సమావేశాల్లో అంగీకరించింది. దీనిపై తెలంగాణవాదులు, ఇంజినీర్లు ఆగ్రహం వ్యక్తం చేయడంతో మాటమార్చిన కాంగ్రెస్ సర్కారు.. ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించేదిలేదని అసెంబ్లీలో తీర్మానం చేసింది. కంటితుడుపు చర్యగా కేంద్ర జల్‌శక్తిశాఖకు లేఖ రాసి చేతులు దులుపుకున్నది.

ఇప్పటికీ సీఆర్పీఎఫ్ ఆధీనంలోనే

కేఆర్‌ఎంబీ ఆధీనంలో ఉన్న సాగర్ డ్యామ్ ఇప్పటికీ సీఆర్పీఎఫ్ నిఘాలోనే కొనసాగుతున్నది. డ్యామ్‌కు మరమ్మతులు చేపట్టాలన్నా, ఇరు రాష్ట్రాల అధికారులను అనుమతించాలన్నా కేఆర్‌ఎంబీ అనుమతి తప్పనిసరి అని కేంద్రం గతంలోనే సీఆర్పీఎఫ్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. దీంతో బోర్డు నుంచి అనుమతిపత్రాన్ని తీసుకుంటేతప్ప డ్యామ్‌పైకి సీఆర్పీఎఫ్ ఎవరినీ అనుమతించడంలేదు. ఏపీ మాత్రం 13 గేట్లు, హెడ్ రెగ్యులేటరీ తమ ఆధీనంలో ఉంటాయని రోజుకో పేచీ పెడుతున్నది. గత వేసవిలో సాగర్ టెయిల్‌పాండ్ నుంచి రాత్రికి రాత్రే 3 టీఎంసీల జలాలను తరలించుకుపోయిన ఏపీ.. బోర్డు అనుమతితో తెలంగాణ ఏ చిన్న పని చేపట్టినా మోకాలడ్డుతున్నది. డ్యామ్‌పై సీఆర్పీఎఫ్ బలగాల మోహరింపుతో తెలంగాణ ఇంజినీర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా రేవంత్ సర్కారు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నల్లగొండ జిల్లాకు చెందినవారే అయినప్పటికీ సాగర్ డ్యామ్‌ను తిరిగి తెలంగాణ ఆధీనంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టకపోగా కనీసం ఆ అంశంపై మాట్లాడటం లేదు.

ఎల్‌ఎండీ గేట్ల ఎత్తివేత

తిమ్మాపూర్, సెప్టెంబర్ 16: కరీంనగర్ శివారులోని లోయర్ మానేరు జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకోవడంతో సోమవారం ఉదయం ఎల్‌ఎండీ ఎస్‌ఈ రమేశ్ స్విచ్ ఆన్ చేసి 10, 11 నంబర్ గేట్లను ఎత్తి 3000 క్యూసెక్కుల నీటిని దిగువన మానేరు వాగులోకి వదిలారు. ఉదయం 9.30 గంటల సమయానికి ప్రారంభించిన గేట్లు 11 గంటలకే మూసివేశారు. శ్రీ రాజరాజేశ్వర జలాశయం నుంచి ఇన్‌ఫ్లో తగ్గడంతో మూసివేసినట్లు అధికారులు తెలిపారు. కాకతీయ కాలువ ద్వారా 2 వేల క్యూసెక్కుల నీటి విడుదలను కొనసాగిస్తున్నారు.

మేడిగడ్డకు తగ్గిన వరద

మహదేవపూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలోని మేడిగడ్డ బరాజ్ వద్ద వరద ప్రవాహం సోమవారం తగ్గుముఖం పట్టింది. బరాజ్ ఇన్‌ఫ్లో 1,75,430 క్యూసెక్కులు ఉండగా 85 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రస్తుత ప్రవాహం రివర్ బెడ్ నుంచి 91.00 మీటర్ల ఎత్తులో కొనసాగుతున్నది.

21న సీతారాం ఏచూరి సంస్మరణ సభ

హైదరాబాద్, సెప్టెంబర్16 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ ఈనెల 21న నిర్వహిస్తామని సీపీఎం రాష్ట్రకార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ కోదండరాం తదితరులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. వామపక్ష మేధావులు, ప్రజాస్వామిక వాదులు ఈ సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మునక 500 ఎకరాలు.. ఎండేది 50 వేల ఎకరాలు

మొదటిపేజీ తరువాయి...

తర్వాత నీటిని విడుదల చేసినా పొలాలకు నీరు చేరాలంటే ఇంకో పదిహేను రోజులు పడుతుంది. అప్పటివరకు మరో 20 వేల ఎకరాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా ఖమ్మం జిల్లా మంత్రులు షట్టర్లు వెల్డింగ్ చేసి నీటిని తరలించుకుపోతే నోరు మెదపకపోవడంతో కాలువ గండి పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు కండ్ల ఎదుటే వరి పంట ఎండిపోతుంటే పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

మంత్రుల అసమర్థతే శాపం

నాగార్జునసాగర్ ఆయకట్టు రైతులకు ఉమ్మడి నల్లగొండ జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అసమర్థత శాపంగా మారింది. బీఆర్ఎస్ హయాంలో నాగార్జునసాగర్ డెడ్ స్టోరేజీ లెవల్‌లోనూ పంటలకు నీళ్లిచ్చి రైతులను ఆదుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత యాసంగి సీజన్‌లో ఒక్క తడికి నీళ్లను ఇవ్వాలని రైతులు గగ్గోలు పెట్టినా ఇవ్వకపోవడంతో దాదాపు లక్షన్నర ఎకరాల్లో పంట ఎండింది. అదే సమయంలో ఖమ్మం జిల్లాకు సాగు, తాగు నీటి కోసం ఆ జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూర్యాపేట జిల్లాలోని కాల్వల ద్వారా నీటిని తరలించుకుపోయారు. ఎక్కడైనా రైతులు తూములు ఎత్తి పంటలను కాపాడుకుంటారేమోనని ఎస్కేప్ రెగ్యులేటర్లు, తూముల షట్టర్లను తెరువరాకుండా వెల్డింగ్ చేసి మరీ నీటిని తీసుకుపోయారు. జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి దానిపై కనీసం నోరు మెదపలేదు. మరోపక్క వెల్డింగ్‌లు తొలగించకుండానే వానకాలం పంటల సాగుకు నీటిని విడుదల చేయడంతో ఇటీవల భారీ వర్షాలకు నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురం వద్ద సాగర్ కాల్వకు గండి పడి దాదాపు 500 ఎకరాల్లో పంట నీట మునిగింది. ఇప్పుడు దాదాపు 30 వేల ఎకరాల్లో వరి పంట ప్రశ్నార్థకంగా మారింది.

సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం తెల్లబండతండాలో ఎండి వరి పైరు

ప్రశ్నార్థకంగా 50 వేల ఎకరాల పంటలు

కాగితరామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమ కాల్వకు గండి పడడంతో ఎగువన నాగార్జునసాగర్ ఎడమకాల్వపై తడకమళ్ల, పానుగోడు రిజర్వాయర్, మునగాల వద్ద షట్టర్లను క్లోజ్ చేసి నీటి ప్రవాహాన్ని తగ్గించారు. గండి పడే కంటే ముందు సాగర్ మెయిన్ కెనాల్‌లో 9వేల క్యూసెక్కుల నీరు ప్రవహించగా గండి ప్రభావంతో ప్రస్తుతం 4వేలకు తక్కువే ఉన్నట్టు అధికారులు చెప్తున్నారు. గండి కారణంగా కోదాడ, నడిగూడెం, అనంతగిరి, మునగాల మండలాల్లో దాదాపు పూర్తిగా నీళ్లు రావడం లేదు. నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలకీడు, హుజూర్‌నగర్, మఠంపల్లి, మేళ్లచెరువు, పెన్‌పహాడ్ మండలాలకు కొంత మేర అందుతున్నాయి. పదిహేను రోజులుగా నీటి ప్రవాహం తగ్గడంతో ఆయా మండలాల్లో ఇప్పటికే దాదాపు 30వేల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నట్టు తెలుస్తున్నది. మరో వారం రోజుల్లో గండి పూడుస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం చెప్పారు. గండి పూడ్చిన తరువాత నీటిని విడుదల చేసినా ప్రస్తుతం ఎండిపోయి నెర్రెలు బారి ఉన్నందున పంట పొలాల్లోకి పూర్తి స్థాయిలో నీరు చేరాలంటే మరో పదిహేను రోజులు పడుతుందని రైతులు వాపోతున్నారు. నీళ్లు వచ్చే సమయానికి మరో 20 వేల ఎకరాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. అంతేగాక ఎండుదశలో ఉన్న పొలాలకు నీళ్లు వచ్చినా వరితోపాటు కలుపు విపరీతంగా పెరిగి అదే స్థాయిలో ఎరువుల వాడకం ఉంటుందని, దిగుబడి కూడా భారీగా పడిపోతుందని వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా తెలిసింది.

పొలాలు నెర్రెలు వారుతున్నయి

సాగర్ ఎడమ కాల్వ కింద 20 ఎకరాల్లో వరి సాగు చేశాను. కాగితరామచంద్రాపురం వద్ద పడ్డ గండితో నీళ్లు బంద్ పెట్టారు. పొలాలకు నీళ్లు లేక నెర్రెలు వారి ఎండిపోతున్నాయి. ప్రభుత్వం త్వరగా పనులు పూర్తి చేసి పంటలను కాపాడాలి.

- గునుగుంట్ల నరేశ్, రైతు, నడిగూడెం